క్లుప్తంగా

ద్వారకా బస్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ



ఆర్టీసీ అధికారి అప్పలనాయుడుతో మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

దాబాగార్డెన్స్: కలెక్టర్ ఎంఎన్ హరేందిరప్రసాద్ గురువారం ద్వారకా బస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ రూట్లలో తిరుగుతున్న బస్సుల సమయపాలన, సమాచార పట్టిక, టాయ్‌లెట్ల నిర్వహణ, శుభ్రత, టికెట్ బుకింగ్ కౌంటర్లు, ప్రయాణికులకు సంబంధించి కుర్చీలు, లైట్లు, ఫ్యాన్లు, మంచినీటి సదుపాయం నిశితంగా తనిఖీ చేశారు. బస్ కాంప్లెక్స్‌లో సీసీటీవీల పనితీరు పరిశీలించారు. బస్సుల్లో శుభ్రత, ప్రయాణికుల పట్ల ఉద్యోగుల ప్రవర్తన ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగులు ప్రయాణికుల పట్ల మర్యాదపూర్వకంగా మెలుగుతూ సేవలందించాలని, ఏసీ బస్సుల పరదాలు ఎప్పటికప్పుడు మార్చాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ పద్మావతి, సెక్యూరిటీ ఆఫీసర్ ఐవీవీపీ దుర్గాప్రసాద్, అసిస్టెంట్ మేనేజర్ నాయుడు, అధికారులు, సూపర్‌వైజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధి చేయాలని ఆందోళన



నిరసన వ్యక్తం చేస్తున్న బీఎస్పీ నాయకులు

కంచరపాలెం: కాన్వెంట్ కూడలిలోని శ్మశాన వాటికను బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర జోనల్ ఇన్‌చార్జి పెదపెంకి శివప్రసాద్ నేతృత్వంలో బీఎస్పీ జిల్లా కమిటీ సభ్యులు గురువారం సందర్శించారు. పారిశుధ్య లోపం, రక్షణ గోడలు శిథిలావస్థకు చేరుకోవడం, ప్రవేశద్వారం అధ్వానంగా ఉండడం వంటి సమస్యలు గుర్తించారు. వాటిని కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. అధికారులు పర్యటించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ముందుగా శ్మశాన వాటికలో గల శానిటరీ కార్యాలయం వద్ద నాయకులు, కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బి.విశ్వనాథం, రామచంద్రరావు, పెద్దాడ కనకమహాలక్ష్మి, ధనుంజయరావు, రమేష్, అప్పారావు, ముచ్చుపల్లి రాంబాబు, కోటి తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌ను సందర్శించిన కలెక్టర్



భోజనం చేస్తున్న వారితో మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: పోర్టు జింఖానా రోడ్డులోని ఫ్రూట్ మార్కెట్ వద్దనున్న అన్న క్యాంటీన్‌ను కలెక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్ గురువారం సందర్శించారు. మధ్యాహ్నం భోజనం సమయానికి వెళ్లిన ఆయన అక్కడి పరిస్థితులను గమనించారు. భోజనం చేస్తున్న యువకులు, వృద్ధులతో మాట్లాడి రుచి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తూ అభిప్రాయాలు వెల్లడించారు. చేతులు కడిగే బేసిన్లు, తాగునీటి వసతి, టికెట్ కౌంటర్లను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. రోజూ సమయపాలన పాటిస్తూ, నాణ్యమైన ఆహారం ప్రజలకు అందించాలని నిర్వాహకులను కలెక్టర్ ఆదేశించారు.

430 మంది విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు

సీతంపేట: జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ మీనాక్షి ఆధ్వర్యంలో గురువారం అక్కయ్యపాలెం ఎన్‌జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 430 మంది విద్యార్థులకు పారా మెడికల్ ఆప్తాల్మిక్ ఆఫీసర్ ఆర్.సురేష్ నేత్ర వైద్య పరీక్షలు చేసి, వీరిలో 64 మందికి దృష్టిలోపం ఉన్నట్లు నిర్ధారించారు. 58 మందికి కళ్లద్దాలు అవసరమని, వారికి రాష్ట్ర ప్రభుత్వం వాటిని పంపిణీ చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జయంతి రాధాకుమారి, నేత్ర వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఇది అన్యాయం..



చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా ఉన్న పథకాలు కూడా తీసేస్తున్నారు. ఇది అన్యాయం. చక్కగా ఇంటి ముంగిటకు వచ్చే రేషన్ వాహనాలను తొలగించారు. దీనివల్ల ఎక్కడో ఉన్న రేషన్ దుకాణానికి ఎలా వెళ్లగలం? మాలాంటి వృద్ధుల కోసం అయినా ప్రభుత్వం మళ్లీ రేషన్ వాహనాలను ప్రారంభించాలి.
– సత్య, పండావీధి, జీవీఎంసీ 35వ వార్డు

బండి పోయి.. బాధలు వచ్చి..



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇంటి ముందుకు వచ్చి రేషన్ పంపిణీ చేస్తున్న దృశ్యం (ఫైల్)

- ఎండీయూ వాహనాలను ఆపేయడంతో ఇబ్బంది పడుతున్న ప్రజలు
- చౌకధరల దుకాణాల వద్ద క్యూ కట్టలేకపోతున్నామని ఆవేదన
- ఉపాధి కోల్పోయిన తమను ఆదుకోవాలని డ్రైవర్ల వినతి

జగదాంబ: గత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఏ ప్రభుత్వం.. ఏ ముఖ్యమంత్రి అమలు చేయని రీతిలో పేదలకు రేషన్ సరఫరా చేసేందుకు మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్లు (ఎండీయూ వాహనాలు)ను తన హయాంలో ప్రారంభించారు. రాష్ట్రంలోని రేషన్ కార్డుదారుల ఇంటి వద్దకే నాణ్యమైన రేషన్ సరుకులు అందజేసేందుకు ఏకంగా 9,260 రేషన్ వాహనాలను ప్రారంభించారు. ఇందుకు రూ.1,860 కోట్లు వెచ్చించారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న వస్తువులలో కల్తీ జరగకుండా చూసుకోవడమే కాకుండా, రేషన్ కార్డుదారులకు చౌకధరల దుకాణాల వద్ద పొడవైన క్యూల నుండి ఉపశమనం కలిగించడానికి కూడా ఈ చర్య తీసుకోబడింది.

సర్కిల్–1లో..

దక్షిణలోని రేషన్ డిపోలకు సంబంధించి సుమారు 50 వరకు ఎండీయూ వాహనాలు ఉన్నాయి. అలా దాదాపు 50 మంది వరకు ఎండీయూ డ్రైవర్లు రేషన్ సరుకులు అందిస్తూ ఉపాధి పొందేవారు. తమతమ కుటుంబాలను పోషించుకునేవారు. అయితే కూటమి ప్రభుత్వం ఎండీయూ వాహనాలను నిలిపివేయడంతో ఆ డ్రైవర్లు రోడ్డున పడ్డారు. మా కుటుంబాలను పోషించుకునేది ఎలా? అంటూ వారంతా ఆవేదనకు లోనయ్యారు. అలా కూటమి ప్రభుత్వం ఎండీయూ వాహనాలను నిలిపివేయడం ద్వారా అటు రేషన్ లబ్ధిదారులు, ఇటు ఎండీయూ వాహనాల డ్రైవర్లను ఒకేసారి ఇక్కట్లపాలు చేసింది.



నేడు మూలకు చేరిన రేషన్ వాహనాలు

ప్రజల ఆశలకు గండి..

ఇంటి ముందుకు వచ్చి రేషన్ సరుకులు ఇచ్చే వాహనాలకు కూటమి ప్రభుత్వం గండి కొట్టింది. నాడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటింటికీ రేషన్ అందించాలనే దృఢ సంకల్పంతో నాటి ముఖ్యమంత్రి రేషన్ వాహనాలు ఇంటి ముందుకు వచ్చి పేదలకు రేషన్ సరుకులు అందించాలని ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో పేదలు డిపోల వద్ద గంటల తరబడి లైన్లు కట్టకుండా సునాయాశంగా సరుకులు తీసుకోగలిగేవారు. రోజువారీ కూలీలు, చిరుద్యోగులు తదితరులు రేషన్ కోసం దూరాభారం వెళ్లకుండా ఇంటి దగ్గరే రేషన్ సరుకులు తీసుకునే వెసులుబాటు కలిగింది. డీలర్లు చేసే మోసాలకు కూడా ఈ పద్ధతి అడ్డుకట్ట వేయగలిగింది. ఈ నేపథ్యంలో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం ఆ సంతోషాన్ని ప్రజల నుంచి దూరం చేసింది. పూర్వం లాగే మళ్లీ డిపోల వద్ద లైన్లు కట్టి రేషన్ తీసుకునే పద్ధతి మొదలుపెట్టింది. దీంతో రోజువారీ కూలీలు, చిరుద్యోగులు పనులు మానుకుని చౌకధరల దుకాణాల ముందు క్యూ కట్టాల్సి వస్తోంది.

పవన్.. ప్రజల పక్షాన నిలబడు..



నేనున్నాను.. ప్రజల పక్షాన పోరాడుతాను.. సమస్యలపై ప్రశ్నిస్తాను అన్న పవన్ కళ్యాణ్ ఏం చేస్తున్నారు. ఉన్న రేషన్ వాహనాలు తీసేశారు. జీవనాధారం కోల్పోయిన రేషన్ వాహనాల డ్రైవర్ల పక్షాన పవన్ ఎందుకు పోరాడడం లేదు? ఇదేనా ప్రశ్నించే తత్వం? ఇప్పటికైనా ఆయన దీనిపై మాట్లాడాలి.
–ఎ. రమణమ్మ, ప్రసాద్‌గార్డెన్స్, జీవీఎంసీ 35వవార్డు

కూటమి ప్రభుత్వంపై నమ్మకం పోయింది..



కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది పైగా అవుతోంది. ఇప్పటి వరకు ఏం చేసిందో కనిపించడంలేదు. పేదలకు ఉన్నవి పోతున్నాయి. ఇదేనా లోకేష్ పాదయాత్రలో ఇచ్చిన హామీ? రేషన్ వాహనాలు తీసేస్తామని పాదయాత్రలో లోకేష్ అనలేదు. మరెందుకు తీసేశారు? సమాధానం చెప్పాలి.
– రాజులమ్మ పండావీధి, జీవీఎంసీ 35వ వార్డు

ఓట్లు వేయించుకుని ఇబ్బంది పెడుతున్నారు..



సంక్షేమ పథకాలు ఇస్తామంటేనే కదా ఓటు వేశాం. ఇప్పుడు ఉన్న వాటిని తీసేస్తారా. ఇదే విషయం ఎన్నికల ముందు చెబితే ఓటు ఎవరికి వేయాలో నిర్ణయించుకునే వారం. అధికారంలోకి వచ్చాక ప్రజలను ఇబ్బంది పెట్టడడం సరి కాదు. పార్టీల మధ్య కక్షలతో ప్రజల పొట్ట గొడుతున్నారు.
– పోలవరపు రమణమ్మ, ప్రసాద్‌గార్డెన్స్, జీవీఎంసీ 35వ వార్డు

శ్రీకృష్ణ జన్మాష్టమికి పందిరి రాట



పందిరి రాట వేస్తున్న సంస్థ మహిళా సభ్యులు, స్థానికులు

దాబాగార్డెన్స్: పాతనగరంలోని స్వామి వివేకానంద సంస్థ వద్ద ప్రతి ఏటా నిర్వహించే శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా గురువారం పందిరి రాట వేశారు. ఈ నెల 15 నుంచి 17 వరకు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించనున్నారు. మూడు రోజుల కార్యక్రమం గోపూజతో ప్రారంభించి, స్వామికి తులసీ దళాలతో సహస్ర నామార్చన, గాయత్రి హోమం, చిన్నారులచే కోలాటం, భగవద్గీత 18 అధ్యాయాల పారాయణ, నామ సంకీర్తన, ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

భయపెడుతున్న పాత భవనం



అల్లిపురం మెయిన్‌రోడ్డులో కూలేందుకు సిద్ధంగా ఉన్న పాత భవనం

అల్లిపురం: అల్లిపురం మెయిన్‌రోడ్డులో పాత భవనం ఒకటి భయపెడుతోంది. మెయిన్‌రోడ్డులో ఉండటం వల్ల ఏ సమయంలో ఏ ప్రమాదం సంభవిస్తుందో అని పాదచారులు, వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు 33వ వార్డు మాజీ కార్పొరేటర్ పచ్చిరిపల్లి లక్ష్మీ రాము జీవీఎంసీ జోనల్ కమిషనర్‌కు బుధవారం వినతి అందజేశారు. మెయిన్‌రోడ్డు, వినాయకగుడి ఎదురుగా పాత భవనం ఒకటి నిరుపయోగంగా ఉందని, అందులో ఎవరూ నివసించడం లేదని, శ్లాబు ముక్కలుగా విరిగి రోడ్డుపై పడుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రమాదకరంగా మారిన ఆ పాత భవనాన్ని తక్షణమే తొలగించి ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

సిరులతల్లికి పూజలు



శ్రావణలక్ష్మి పూజలో పాల్గొన్న భక్తులు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శ్రీలక్ష్మి పూజలు గురువారం 7వ రోజుకు చేరాయి. కార్యక్రమంలో ఆలయ ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం..

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. కార్యక్రమంలో ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు సువర్ణ వస్త్రాలంకరణలో కన్యకాపరమేశ్వరి దర్శనం..

శ్రావణ మాసం రెండో శుక్రవారాన్ని పురస్కరించుకుని కురుపాం మార్కెట్ సమీపాన వేంచేసిన కన్యకాపరమేశ్వరి అమ్మవారు సువర్ణ వస్త్రాలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉదయం 5 నుంచి 7 గంటల వరకు అమ్మవారి మూలవిరాట్‌కు క్షీరాభిషేకం, 8 గంటలకు ప్రత్యేక పూజలు జరపనున్నారు. 10 గంటలకు మహిళలచే సామూహిక లలితా సహస్ర నామ పారాయణ, 10.30 గంటలకు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించనున్నారు.

నెహ్రూబజార్ పునరుద్ధరణకు ప్రణాళికలు సిద్ధం చేయాలి



కమిషనర్‌కు సమస్యలు తెలుపుతున్న నెహ్రూ బజార్ వ్యాపారులు

దాబాగార్డెన్స్: పురాతన నెహ్రూ బజార్ శిథిలావస్థకు చేరుకుంటున్నందున, దాని పునరుద్ధరణకు ప్రణాళికలు సిద్ధం చేయాలని జీవీఎంసీ అధికారులను కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, వార్డు కార్పొరేటర్ గొలగాని వీరారావుతో కలిసి నెహ్రూ బజార్‌ను పరిశీలించారు. పరిశీలనలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పురాతన నెహ్రూ బజార్ నగర మధ్యలో ఉన్నందున ప్రజలు ఎక్కువగా వస్తుంటారని, బజార్‌లో పలు దుకాణాలు శిథిలావస్థకు చేరుకున్నాయని తెలిపారు. వ్యాపారులకు అనుగుణంగా పునరుద్ధరణ జరగాలన్నారు. మరుగుదొడ్లు, తాగునీరు, కాలువలు ఏర్పాటు చేసి అందంగా తీర్చిదిద్ది, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పర్యవేక్షక ఇంజినీర్ సత్యనారాయణరాజును కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. బజార్‌లో నిత్యం పారిశుధ్య పనులు పర్యవేక్షించాలని వార్డు శానిటేషన్ కార్యదర్శికి కమిషనర్ ఆదేశించారు. అనంతరం డైమండ్ పార్క్‌లో ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాలను పరిశీలించి, వాటి లోపాలు సరి చేసి, పెయింటింగ్ వేయాలని సహాయక ఇంజినీర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక ఇంజినీర్లు గంగాధర్, మురళీకృష్ణ, సహాయ వైద్యాధికారి బి.ప్రసాదరావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ జీవితం సంతోషదాయకం కావాలి



పదవీ విరమణ చేసిన ఉద్యోగులను సత్కరిస్తున్న అదనపు కమిషనర్ వర్మ తదితరులు

దాబాగార్డెన్స్: జీవీఎంసీలో సుదీర్ఘకాలం విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేసిన ప్రతి ఒక్కరి శేష జీవితం ఆనందదాయకంగా ఉండాలని అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ పేర్కొన్నారు. యూసీడీ ప్రాజెక్టు ఆఫీసర్ డి.లక్ష్మి, స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన పర్యవేక్షకురాలు వై.మంజుల, సీనియర్ అసిస్టెంట్ కె.వసంతతో పాటు మరో 12 మంది ఉద్యోగులను యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ సత్యవేణితో కలిసి సత్కరించారు. అనంతరం అదనపు కమిషనర్ మాట్లాడుతూ అందరి మన్ననలు పొందుతూ గ్రేడ్–1 మున్సిపల్ కమిషనర్ స్థాయిలో ఉద్యోగ విరమణ చేసిన లక్ష్మి సేవలను ప్రభుత్వం గుర్తించి స్పెషల్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతి కల్పించడం ఆనందదాయకమన్నారు. అనంతరం ఉద్యోగ విరమణ చేసిన వారిని సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఉద్యోగులకు సంబంధించి రూ.కోటి 39 లక్షలు పీఎఫ్ అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ సత్యవేణి, జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి, యూసీడీ ప్రాజెక్టు ఆఫీసర్ ప్రసన్న వాణి, డిప్యూటీ ప్రాజెక్టు ఆఫీసర్ శాంతి కుమారి, ఏవో అప్పలనాయుడు, ఏపీడీలు, సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతాలు



గర్భిణులకు సీమంతాలు చేస్తున్న క్లబ్ ప్రతినిధులు

సీతంపేట: రోటరీ క్లబ్ ఆఫ్ వైజాగ్ సురభి ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం లలితానగర్ చాకలిగెడ్డ అంగన్వాడీ కేంద్రంలో గురువారం మెటర్నిటీ అండ్ చైల్డ్ హెల్త్ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. పండ్లు, ప్రొటీన్ పౌడర్, బాలింతలకు బేబీ టవళ్లు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అనూష, డాక్టర్ సంతోష్ బాలజీ గర్భిణులు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, ప్రసవం సులువుగా అవడానికి కొన్ని వ్యాయామాలు డెమో చేసి చూపించారు. కార్యక్రమంలో 26వ వార్డు కార్పొరేటర్ ముక్కా శ్రావణి, క్లబ్ ప్రతినిధులు శివకుమార్‌రెడ్డి, టి.సత్యశ్రీ, లక్ష్మీదేవి, హర్ష మానేపల్లి, రమణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను వంచించడమే చంద్రబాబు నైజం



బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న ముత్తాబత్తుల రమేష్, పచ్చిరిపల్లి రాము తదితరులు



స్ప్రింగ్‌రోడ్డులో ప్రచారం చేస్తున్న వార్డు అధ్యక్షుడు కనకరెడ్డి తదితరులు

అల్లిపురం: మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆదేశాల మేరకు 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమం గురువారం 33వ వార్డు అధ్యక్షుడు ముత్తాబత్తుల రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గడప గడపకు వెళ్లి బాబు ఎన్నికల హామీల అమలులో ప్రజలను మోసం చేసిన విధానాన్ని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పచ్చిరపల్లి రాము, వెంకటేశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ ఆడారి వెంకట మహేష్, సౌత్ కల్చరల్ వింగ్ అధ్యక్షుడు సూర్యనాయుడు, సంతోష్ కుమార్, హేమ, ధర్మ, పీవీఎస్ రెడ్డి, కృష్ణారెడ్డి, బూర్లు చిన్న, మత్స్యకార నాయకుడు చోడిపల్లి శివకుమార్, తరుణ్ పాల్గొన్నారు.

35వ వార్డులో..

జగదాంబ: బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం 35వ వార్డులో అధ్యక్షుడు కనకరెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. దుర్గమాంబ సమాజం 77వ బూత్‌లో కార్యకర్తలతో కలిసి చంద్రబాబు మోసపూరిత హామీలపై ప్రజలకు వివరించారు. ఇటువంటి ప్రభుత్వాన్ని నమ్మి ప్రజలు మోసపోయారన్నారు. ఈ క్యాక్రమంలో పార్టీ జిల్లా సెక్రటరీ ఆదివిష్ణురెడ్డి, సౌత్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సువర్ణరాజు, పబ్లిక్ వింగ్ అధ్యక్షుడు జీరు సూర్యనారాయణ, సిటీ వాణిజ్య విభాగం సెక్రటరీ గంగాధర్, నాగిరెడ్డి, శేఖర్, రవికుమార్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సరైన చికిత్సా విధానంతో లివర్ వ్యాధులకు చెక్



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాసన్

మహారాణిపేట: ప్రతి ఏడాది వేలాది మంది లివర్ క్యాన్సర్, ఇతర లివర్ సమస్యలతో ప్రాణాలు కోల్పోతున్నారని, సరైన చికిత్సా విధానంతో వారి ప్రాణాలు కాపాడవచ్చని సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ డి.శ్రీనివాసన్ అన్నారు. గురువారం విశాఖ సెవెన్ హిల్స్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖలోని ఎంజీఎం సెవన్ హిల్స్ హాస్పిటల్‌లో ఆధునిక లివర్ ట్రాన్స్‌ప్లాంట్ ఇనిస్టిట్యూట్ డాక్టర్ థియాగరాజన్ శ్రీనివాసన్ (సీనియర్ కన్సల్టెంట్ – డైరెక్టర్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ లివర్ డిసీజెస్, ట్రాన్స్‌ప్లాంట్ – హెచ్‌పీబీ సర్జరీ) నేతృత్వంలో ప్రారంభమైందని ఆస్పత్రి జనరల్ మేనేజర్ (మార్కెటింగ్) సందీప్ కుమార్ తెలిపారు. ప్రపంచ ప్రమాణాల ప్రకారం చికిత్స పొందవచ్చన్నారు. ఈ సమావేశంలో ఎంజీఎం హెల్త్ కేర్ క్లస్టర్–2 హెడ్ పద్మనాభన్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాఘవేంద్ర, వైద్యులు విశ్వనాథ్, శ్రీకాంత్ తుమ్మల, ఉషా రామకృష్ణ, డాక్టర్ గౌతమ్ కుమార్, డిప్యూటీ జనరల్ మేనేజర్లు అశోక్ పటాన్నయక్, రమేష్ ఎండాడ, డిప్యూటీ జనరల్ మేనేజర్లు శైలజ (ఆపరేషన్స్), శివప్రకాష్ (లివర్ ట్రాన్స్‌ప్లాంట్ డివిజన్) తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- జనావాసాల మధ్యలో భారీ వర్క్‌షాప్
- ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు



భవనం పైఅంతస్తులో నిర్వహిస్తున్న వర్క్‌షాపు



టౌన్‌హాల్ దగ్గర నుంచి తరలిస్తున్న భారీ సిలిండర్లు (ఫైల్)

జగదాంబ: జనావాసాల మధ్య, ముఖ్యంగా పోలీస్ కమిషనర్ కార్యాలయం సమీపంలో నౌకల్లో వినియోగించే సిలిండర్ల మరమ్మతు కోసం వర్క్‌షాప్ నిర్వహించడం పట్ల స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి వర్క్‌షాపులు నగర శివార్లలో ఏర్పాటు చేయాలి.. కానీ జనావాసాల మధ్య ఓ దుకాణ సముదాయం పై అంతస్తులో నిర్వహించడం ప్రమాదకరమని వాపోతున్నారు. ఈ సిలిండర్ల బరువు దాదాపు రెండు వందల కేజీల కంటే ఎక్కువగా ఉంటుందని.. ఇటువంటివి 50 సిలిండర్లకు పైగా తీసుకొచ్చి మరమ్మతులు చేస్తున్నట్లు చెబుతున్నారు. గతంలో టౌన్‌హాల్ సమీపంలో వర్క్‌షాపు పెట్టి మరమ్మతులు చేసేవారు. అయితే అక్కడ స్థానికులు ఎదురు తిరగడంతో కాంట్రాక్టరు అక్కడ వర్క్ షాప్ తొలగించినట్లు సమాచారం. ఈ భారీ సిలిండర్లలో ఏ ఒక్కటి లీకైనా, పేలినా పెను ప్రమాదం తప్పదని సూర్యాబాగ్ వ్యాపారులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే ఈ వర్క్‌షాపును తొలగించాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా ఈ భారీ సిలిండర్లను కాంట్రాక్టర్ ప్రస్తుతం నౌకల వద్దకు చేరవేసినట్లు సమాచారం.

వర్క్‌షాప్ మాత్రం యథావిధిగా కొనసాగుతుందని చుట్టుపక్కల వారు చెబుతున్నారు.

వెల్ఫేర్ బోర్డు పునరుద్ధరణకు డిమాండ్



మాట్లాడుతున్న శ్రీనివాస్

దాబాగార్డెన్స్: భవన నిర్మాణ కార్మికులకు తక్షణం వెల్ఫేర్ బోర్డు పునరుద్ధరించాలని విశాఖ జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం సిటు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాస్ మాట్లాడారు. ఎన్నికలకు ముందు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చిన సంగతి గుర్తు చేశారు. కార్మిక శాఖ మంత్రి సుభాష్ విశాఖ విచ్చేసిన తొలిసారి నిర్వహించిన సమావేశంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి భవన నిర్మాణ కార్మికులు ఎంతో దోహదపడ్డారన్న సంగతిని గుర్తు తెచ్చుకోవాలన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా ఇంత వరకు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. వెల్ఫేర్ బోర్డు పునరుద్ధరణకు కార్మికులు పెద్ద ఎత్తున ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని పిలుపునిచ్చారు. ప్రతి నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యేలను కలిసి వినతి పత్రాలు అందజేయాలన్నారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే చలో విజయవాడ నిర్వహిద్దామన్నారు. కార్యక్రమంలో జి.పోలేశ్వరరావు, పి.రాజశేఖర్, శ్రీను, నర్సింగరావు, శివాజీ, లోవరాజు, సిమ్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.

చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు చేయూత

తాటిచెట్లపాలెం: చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు చేయూతనిచ్చేందుకు తమ బ్యాంక్ వ్యాపారాన్ని 10 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలనే లక్ష్యంతో ఉన్నట్లు యాక్సిస్ బ్యాంక్ వాణిజ్య గ్రూప్ అధ్యక్షుడు విజయ్ శెట్టి తెలిపారు. విశాఖలో గురువారం యాక్సిస్ బ్యాంక్ ఎవాల్వ్ సెమినార్ 10వ ఎడిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ జాతీయ జీడీపీకి 4.9 శాతం, ఎగుమతుల్లో 5 శాతం వాటా యాక్సిస్ బ్యాంక్ అందిస్తోందన్నారు. గత పదేళ్లలో ఎవాల్వ్‌లో 50కి పైగా నగరాల్లో 10 వేల మంది పారిశ్రామిక వేత్తలను భాగస్వాములుగా చేశామని చెప్పారు. సెమినార్‌లో పాల్గొన్న పలువురు పారిశ్రామిక వేత్తలు ముఖ్యమైన అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో సుమారు 110 మంది పారిశ్రామిక నిపుణులు, యాక్సిస్ బ్యాంక్ ఉన్నతాధికారులు ప్రశాంత్ టీఎస్, బ్రిజేష్ చాహిల్ పాల్గొన్నారు.